# అమరావతి కథలు

సత్యం శంకరమంచి



చీమ చిటుక్కుమంటే కళ్ళుటు తిప్పి చూస్తాడు ఈశ్వరప్ప. కొమ్మల ఆకులు గలగల్లాడితే అటు ముఖమైపోతాడు. చిలకలు ముక్కులు పొడుచుకుంటూ కిచకిచలాడుతుంటే కళ్ళింత చేసుకు చూస్తాడు. గాలిగోపురం పావురాళ్ళు 'కూఊ' 'కూఊ' అంటూ గొంతు బిగబట్టి అరుస్తూ రెక్కలాడ్చుకుంటుంటే పరవశంతో చప్పట్లు చరుస్తాడు. కృష్ణమ్మ బుడగలు పేర్చుకుంటూ, రాళ్ళని చుట్టుకొంటూ గలగల పాపుతుంటే రాత్రింబగళ్ళు అక్కడే గడిపేస్తాడు. ఎక్కడ ఎలాంటి శబ్దమైనా పొంగిపోయి పరుగెత్తుతాడు. పదిహేనేళ్ళ శంకరప్పకి శబ్దమంటే ప్రాణం. ఆ ప్రాణమైన శబ్దాన్ని అతనిగొంతు పలికించలేదు. అతడు పుట్టు మూగ.

"వూఊ....ఊ....ఊ....నాకు బొంగరం కొనిపెట్టు"

ఓ ఐదేళ్ళపిల్ల మారాంచేస్తూ గోముగా తల్లినడుగుతోంది.

తల్లి ఏదో చెప్తోంది. పిల్ల వినకుండా "వూఊ....ఊ....ఊ" మారాం చేస్తోనే ఉంది. ఆ మారాం చేస్తున్న పిల్లగొంతు ఎంత హాయిగా ఉందో శంకరప్పకి. తల్లి బొంగరానికి త్వరగా డబ్బు యిచ్చేస్తుందేమో, మరికొంచెంసేపు ఆ పిల్ల తల్లి వాళ్ళో దూరి మారాం చేస్తే ఎంత బావుండును అనుకున్నాడు శంకరప్ప.

కృష్ణ వొడ్డుకెళ్ళాడు. అక్కడ ఆడవాళ్ళు బట్టలుతుకుతూ యెడం చేసిన రెండు పాదాల మధ్య టావ్‌మని చీర బాదుతూ 'ఆ హుష్' అంటున్నారు. మళ్ళీ 'టావ్....ఆ హుష్.... టావ్ ఆ హుష్' శబ్దం వింటూ అక్కడే వుండిపోతాడు. ఆ పైన చాకళ్ళ దగ్గరకొస్తే వాళ్ళు బట్ట బండమీద బాదుతూ "ష్ ష్" అని ఈల వేస్తున్నారు "టావ్....ష్.... టావ్....ష్" తాళానికి తగ్గట్టు ఆ శబ్దం వింటూ అన్నం మరిచిపోతాడు.

ఎక్కడో సన్నాయి మోగింది. రయ్యిమని వీధిలోకి పరుగెత్తాడు. సన్నాయి వాద్యం మెలికలు మెలికలుగా గాలిలో కలిసిపోతోంది. ఆ సన్నాయి మూతి దగ్గర చెవి పెట్టి నుంచున్నాడు శంకరప్ప. ఆ నాదం చెవులార వింటుంటే అతనికి లోపల శంఖాలు మోగుతున్నట్టుంది. 'ఖయ్' అని సన్నాయి పైస్వరం అందుకుంటే మనసు ఆకాశాన్ని తాకుతున్నట్టుంటుంది. డోలు

## ప్రణవమూర్తి

వరసలు వాయిస్తుంటే శరీరమంతా లయానుగుణంగా వూగిపోతోంది. అయ్యో! అంత నాదస్వరం నాలో పలక్కపోయినా, అంత డోలు లయ నాలో విప్పించకపోయినా, ఆ చిన్ని తాళంలాంటి చప్పుడైనా నేను చేయలేకపోతున్నానే అని కుమిలిపోయాడు శంకరప్ప.

సాయంవేళ పరుగు పరుగున గుళ్ళో కొచ్చాడు. చిలకలా "కూ" అన్నాడు. శబ్దం రాలేదు. పావురాయిలా "కువూ" అన్నాడు శబ్దంలేదు. "అ హుష్" అన్నాడు లేదు. "ష్" అని ఈలవేశాడు లేదు. ఏదు పొచ్చింది. జమ్మి ఆకులు గాలికి జలజల మోగాయి. మీరెంత పుణ్యం చేసుకున్నారు అనుకుని కళ్ళు తుడుచుకున్నాడు. వెన్నెట్లో జమ్మి ఆకుల మోతలు, కొమ్మ కొమ్మ గాలికి "కిర్"మని రాసుకోటాలు ఆనందంగా వింటున్నాడు. ఎక్కడో గుడ్లగూబ ఝూంకరింపు కూడా అతనికి ఆనందంగానే ఉంది.

కొన్ని శబ్దాలు విన్నప్పుడు చిరకాల స్నేహితుడు పలకరించినట్లుంటుంది. కొన్ని శబ్దాలు గిలిగింతలు పెడ్తాయి. కొన్ని శబ్దాలు హాయిగా నవ్విస్తాయి. కొన్ని శబ్దాలు లోపలున్న దుఃఖాన్ని భళ్ళు భళ్ళున బయటకు లాగుతాయి. కొన్ని శబ్దాలు భయంతో శరీరాన్ని వూపేస్తాయి. శంకరప్పకు అలా కాదు. అన్ని శబ్దాల్నీ అతని శరీరం ఆహ్వానిస్తుంది. అన్ని శబ్దాల్ని అతని మనస్సు లయం చేసుకుంటోంది.

శివరాత్రినాడు శంకరప్పని చూడాలి. అంతటా అతనే. పల్లకీల దగ్గర అతనే గుర్రంలాట దగ్గర అతనే....నామ సంకీర్తనం దగ్గర అతనే.... కొబ్బరి కాయలు పేలుడునే శబ్దం దగ్గర అతనే మంత్ర పుష్పాల దగ్గర అతనే.... హరహర మహాదేవ అని ఆకాశాన్నంటే కేకల దగ్గర అతనే.... శంఖాలు, గంటలు, తప్పెట్లు, తాళాలు.... రండోళ్ళు.... డోళ్ళు....అన్ని శబ్దాల్ని అంతరంగంలో దాచుకుంటూ ఉన్మాదిలా తిరిగాడు శంకరప్ప.

అన్ని నాదాల్ని అన్ని శబ్దాల్ని తనలో నింపుకొని తనూ పలకాలని, తనూ ఈ శబ్ద సముద్రంలో ఓ బిందువవ్వాలని, మారేడు చెట్టు కింద కూర్చుని గొంతు పెగలించుకుంటున్నాడు. రాత్రయింది. గొంతునించి శబ్దం లేదు. నరాలు గింజుకుంటున్నాయి, గుండె కదిలిపోతోంది. శరీరం వణికిపోతోంది. చెమటలు పట్టున్నాయి. కళ్ళు ధారలవుతున్నాయి. రక్తం మరిగిపోతోంది. శబ్దం.. శబ్దం..రావాలి.. పలకాలి..

ఎట్టకేలకు శంకరప్ప గొంతు పలికింది. నరాలు విదిల్చుకొని, గుండె తలుపులు పగలగొట్టుకొని, శరీర బంధులు చీల్చుకుని ఒకేఒక శబ్దం వచ్చింది. ఓం.. ఓం.. ఓం.. ఓం.. ఓం..". సర్వ శబ్దాలకు సర్వ నాదాలకు ఆదియైన అంత్యమైన 'ఓం.. ఓం.. ఓం.'

★



గజరాజు

ఫొటో ; యస్. రామయ్య, హైదరాబాదు